
బర్కత్‌పుర చౌరస్తాలో స్టేజీపైనుంచి గణేష్ విగ్రహాలపై పుష్పవర్షం కురిపిస్తున్న దృశ్యం



గణనాథులకు స్వాగతం పలుకుతున్న నాయకులు


అంబర్‌పేటలో గణేషుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

గణపయ్యా.. వెళ్లిరావయ్యా

గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో 11 రోజులు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణపయ్యను మండపాల నిర్వాహకులు గంగమ్మ ఒడికి చేర్చారు. మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, యువత కేరింతలతో శోభాయాత్ర సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత తోరణాల వద్ద పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు విఘ్నేశ్వరుడిని దర్శించుకున్నారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ల బృందం


నిమజ్జనానికి తరలివెళ్తున్న నవ్య కళా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు


గణనాథులకు స్వాగతం పలుకుతున్న మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవిరమేష్, దిడ్డి రాంబాబు


న్యూనల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ వీధి నుంచి నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


నల్లకుంటలో గణనాథులకు స్వాగతం పలికేందుకు వచ్చిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సన్మానిస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్య


చెప్పల్‌బజార్ మహాగణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


జవహర్‌నగర్ గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ సతీమణి ముఠాసరోజ


నిమజ్జనోత్సవంలో పాల్గొన్న నింబోలి అడ్డ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు


నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య

వేలం.. లడ్డూలు సొంతం


జై గణేష్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో రూ.1.56 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్న శ్రీనివాస్ గౌడ్


భోలక్ పూర్‌లో శ్రీ సిద్ధి వినాయక భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను రూ.6.30లక్షలకు సొంతం చేసుకున్న నవీన్‌కుమార్

దోమలగూడ తాళ్లబస్తీలో రూ.69 వేలకు లడ్డూ దక్కించుకున్న మంగూరి శ్రీనివాస్


అవార్డు అందజేత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ ఆధ్వర్యంలో రాంనగర్‌లోని చైతన్య యూత్ అసోసియేషన్‌కు లోకమాన్య యూనిటీ అవార్డును ప్రదానం చేసింది. శనివారం గణేష్ నిమజ్జనం సందర్భంగా యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం విన్ను ముదిరాజ్‌కు అవార్డును అందజేశారు.

గృహిణి మృతికి కారణమైన భర్త, అత్త రిమాండ్

కాచిగూడ: అదనపు కట్నం కోసం వేధించి ఓ గృహిణి ఆత్మహత్యకు కారణమైన భర్త, అత్తను కాచిగూడ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ వై.హరీష్‌కుమార్ వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన ఆభంగ్ కుమారుడు అర్జున్ ముంగవాలే (26)కు ఏప్రిల్ 2025లో మంగళ్‌హాట్ ప్రాంతానికి చెందిన కె.అక్షితతో వివాహం జరిగింది. వరకట్నం కింద అత్త, మామలు రూ.25 వేలు ఇవ్వాల్సి ఉంది. గత కొన్ని రోజులుగా అక్షిత భర్త అర్జున్,అత్త మందాబాయి అదనపు కట్నం తీసుకురావాలని అక్షితతో తరచూ గొడవ పడుతూ వేధించేవారు. వేధింపులు తాళలేక ఆక్షిత బాత్రూమ్‌లో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అక్షిత భర్త, అత్తను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

'భారత్ విశ్వగురువుగా మారుతుంది'


అన్నదానం సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న పలువురు ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: భారతదేశం రానున్న కాలంలో విశ్వగురువుగా మారుతుందని కేశవ్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం వైఎంసీఏ హాల్‌లో భారత్ వికాస పరిషత్ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో గురు వందనం–చాత్రాది నందనం పేరిట గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది ఉపాధ్యాయులకు గురువందనం, ఐదుగురు ఉత్తమ విద్యార్థులకు చాత్రాభినందన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గురువులను దైవ సమానంగా పూజించే మన దేశం విశ్వ గురువుగా మారడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు నాగేశ్వర్‌గుప్తా, కార్యదర్శి శివరామ కృష్ణ, సాధన నర్సింహాచార్య చౌదూరు నర్సింహా రావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు శనివారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కయ్యు వెంకటేష్, శంకర్‌నాయక్, రవికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు కావస్తున్నా 10 వేల ఉద్యోగాలు భర్తీ చేయకపోగా గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు మేమే ఇచ్చామని చెప్పు కోవడం సిగ్గుచేటన్నారు. మీడియా ముందు కూడా అబద్దాలు అడటం సరికాదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. త్వరలోనే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులందరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్నాలో బాలకోటి రవికుమార్, శ్రీను, సంపత్, మధుగౌడ్ పాల్గొన్నారు.

ఉత్తరాదిమఠంలో పూజలు

కాచిగూడ: అనంత చతుర్దశి సందర్భంగా శనివారం కాచిగూడ లింగంపల్లిలోని ఉత్తరాదిమఠంలో మఠం పీఠాధిపతి మధ్వాచార్య సత్యాత్మ తీర్థ స్వామిజీ విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠంలోని వేంకటేశ్వర స్వామిని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ కె.గీతామూర్తి దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం ప్రతినిధులు పగడాల జయతీర్థాచార్, రాఘవేంద్రాచార్ జయమంగళ, అచార్యులు శ్రీశ్రీనివాస్ యాదగిర్కర్, శ్రీగురురాజ్, పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న గీతామూర్తి

బైరు మల్లయ్యకు నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక న్యాయం కోసం పోరాడటమే బైరు మల్లయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని కల్లుగీత సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కల్లుగీత సంఘం మాజీ అధ్యక్షులు బైరు మల్లయ్య వర్ధంతి సభలో వెంకటరమణ పాల్గొని మాట్లాడారు. గీతా కార్మికులను చైతన్యం చేసి వారి హక్కుల పరిష్కారం కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి మల్లయ్య అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న గొప్ప పోరాట యోధుడు మల్లయ్య అని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాస్వామిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మల్లేశం, ఆశయ్య, బాలకృష్ణ, రవీందర్, అంబాల నారాయణ గౌడ్,పొన్నం రాజయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

నేడు ఆలయాల మూసివేత

చిక్కడపల్లి: ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 12 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు చిక్కడపల్లిలోని ఆలయాలను మూసివేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రహణం సందర్భంగా సోమవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి అనంతరం భక్తుల సందర్శనం కల్పిస్తామని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు శ్రీ లక్ష్మీగణపతి ఈఓలు మాటర్ల దేవనాథం, లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

కేంద్రమంత్రికి వినతి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ, గుజ్జకృష్ణ

కాచిగూడ: 42 శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగెళ్లమూడి నందగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం బర్కత్‌పురలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి బీసీల సమస్యలను పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

333 కిలోల లడ్డూను రూ.100కే..

సనత్‌నగర్: పదకొండు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడి లడ్డూ కోసం లక్షల్లో వేలంపాట నడుస్తుండగా, బల్కంపేటకు చెందిన సాక్షాత్‌గౌడ్ రూ.100లకే 333 కిలోల వినాయక లడ్డూ వరించింది. కొత్తపేటలోని శృంగేరీ కాలనీలో శ్రీఏకదంతా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వినాయక లడ్డూ వేలం లాటరీ పద్ధతిలో నిర్వహించారు. లాటరీ టికెట్ రూ.100లుగా నిర్ణయించారు. ఈ లాటరీలో సాక్షాత్‌గౌడ్‌కు లడ్డూ దక్కింది. విశేష పూజలందుకున్న గణనాథుడి చేతుల్లో లడ్డూలను కై వసం చేసుకునేందుకు వేలంపాటల్లో పాల్గొని లక్షలు వెచ్చించేందుకైనా వెనుకాడారు. వినాయకుడి లడ్డూ అంటే అంత సెంటిమెంట్‌గా భావిస్తారు. అలాంటిది 333 కిలోల లడ్డూ కేవలం రూ.100లకే దక్కడంపై తనకు కలిగిన అదృష్టానికి సాక్షాత్‌గౌడ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత


స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్

కాచిగూడ: ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు, ఆర్యవైశ్య హాస్టల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు వేలూరు లింగయ్య గుప్త 101వ జయంతి వేడుకలను కాచిగూడలోని హాస్టల్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలూరు లింగయ్య గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, స్కూల్ బ్యాగుల కిట్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. మనిషికి జన్మనిచ్చేది తల్లిదండ్రులు అయితే, సామాజిక జన్మనిచ్చేది గురువులు అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాను జ్ఞానసాధన కోసం మాత్రమే వినియోగించుకోవాలని, అనవసరమైన విషయాల్లో సమయం వృథా చేయకుండా, క్రీడలు, పుస్తక పఠనాన్ని సమన్వయం చేసుకుంటేనే సంపూర్ణ అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, వెంపటి మధు, హాస్టల్ అధ్యక్షుడు ఉప్పాల రాజశేఖర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దటూరి రాజేశ్వర్ రావు, కూర జయరాములు గుప్త, మ్యాడం దయాకర్ గుప్తా పాల్గొన్నారు.

ఆ భూములపై న్యాయ విచారణ చేయాలి

సీఎంకు బహిరంగ లేఖ ద్వారా డిమాండ్

లాలాపేట: అసైన్డ్, లిడ్ క్యాప్ భూముల అన్యాక్రాంతం, డిక్కీ(డీఐసీసీఐ) మోసాలపై న్యాయ విచారణకు కమిషన్ ఏర్పాటు చేయాలని ఆర్‌పీఐ(భీమ్‌రావ్ అంబేడ్కర్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం తార్నాకలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 20 లక్షల ఎకరాల దళిత పేదల అసైన్డ్ భూములు, వందల ఎకరాల్లో లీడ్ క్యాప్ భూములు తెలంగాణలో అన్యాక్రాంతమయ్యాయన్నారు. డిక్కీ పేరుతో దళిత దళారులు వేలకోట్ల రూపాయలను మింగేసారని ఆరోపించారు. వీటన్నింటిపై న్యాయ విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సీఎంకు బహిరంగ లేఖ రాశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ సమక్షంలో విడుదల చేసిన పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్యాక్రాంతమైన అసైన్డ్, లీడ్ క్యాప్, పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామన్నారని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ లేఖ ద్వారా గుర్తు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజేఏసీ అధ్యక్షుడు బోయ శంకర్ తదితరులున్నారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలి

గన్‌ఫౌండ్రీ: హిందువులను ఏకం చేసేందుకు సామూహిక గణేష్ నిమజ్జనోత్సవం ఎంతగానో దోహదపడుతుందని త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం ఎంజేమార్కెట్ చౌరస్తాలో గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన స్వాగత వేదిక పై నుంచి ఆయన ప్రసంగించారు. ఏ కష్టం వచ్చినా మొదట గణేషుడికే పూజ చేస్తామని అదేవిధంగా దేశానికి ఏ కష్టం వచ్చినా గణేషునికి పూజలు చేస్తే విఘ్నాలు తొలిగిపోతాయన్నారు. బ్రిటీష్‌వారితో పోరాటం చేసే సమయంలో సైతం హిందువులను ఐక్యం చేసేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయని గుర్తు చేశారు. ప్లాస్టిక్ రహిత, కాలుష్యరహిత సమాజం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ..కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు గణేష్ నిమజ్జనోత్సవంలో పాలుపంచుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశ ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. మంచి ఏర్పాట్లు చేసిన ప్రభుత్వానికి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడిపి ఉత్తరాది పీఠాధిపతి శ్రీశ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ తదితరులు పాల్గొన్నారు.